తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక




హైదరాబాద్ బుధవారం 16 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 4

# తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా..

# దాచారం సర్పంచ్ జ్యోతివీరేశం

## నియమించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్



ప్రజావారధి/మోత్కూరు

యాదాద్రి జిల్లా మోత్కూరు మండలం దాచారం సర్పంచ్ కర్నె జ్యోతివీరేశం తెలంగాణ సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సొదాని భూమన్న యాదవ్ సర్పంచ్ జ్యోతివీరేశంను రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియమించారు. మంగళవారం భూమన్న యాదవ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి జ్యోతివీరేశం మాట్లాడుతూ సర్పంచుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానన్నారు. సంఘం నియమ, నిబంధనలకు లోబడి పని చేయడంతో పాటు సంఘం బలోపేతానికి తోడ్పడతానన్నారు. తన నియామకం కోసం సహకరించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న యాదవ్‌తో పాటు ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పండితరావు పటేల్, ఆత్మకూరు మాజీ జడ్పీటీసీ గంగాపురం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
బుధవారం
జనరల్ న్యూస్
16 - 09 - 2026


# మోత్కూరు కల్లు గీత పారిశ్రామిక సంఘం ఎన్నికలు



## ఎన్నికైన 9 మంది డైరెక్టర్లు

## ఈనెల 18న అధ్యక్షుని ఎన్నిక

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు కల్లు గీత పారిశ్రామిక సంఘం ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. సంఘంలో 9 డైరెక్టర్ స్థానాలకు 7 జనరల్, 2 మహిళా డైరెక్టర్ స్థానాలు ఉండగా ఎన్నికల్లో 16 మంది పోటీ చేశారు. గౌడ, తెనుగు గౌడ వర్గాలుగా విడిపోయిన సభ్యులు గౌడ కులం నుంచి 9 మంది ప్యానెల్‌తో పోటీ చేయగా, తెనుగు గౌడ కులం నుంచి 7 మంది ప్యానెల్ పోటీ పడ్డారు. ఎన్నికల్లో 415 ఓట్లకు గాను 328 ఓట్లు పోలయ్యాయి. అందులో మహిళా డైరెక్టర్లకు పోలైన ఓట్లలో 13 ఓట్లు, జనరల్ డైరెక్టర్లకు పోలైన ఓట్లలో 11 ఓట్లు మొత్తం 24 ఓట్లు చెల్లని ఓట్లు పోగా 304 ఓట్లు పోలైనట్టు ఎన్నికల అధికారి, కోఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ వి.విజయ కృష్ణ తెలిపారు. బ్యాలెట్‌తో నిర్వహించిన ఎన్నికల్లో గౌడ కులస్తులు 9 మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. బందారపు యాదగిరి (178 ఓట్లు), బీసు రవి( 176), బీసు సత్తయ్య (183), బైరు భిక్షం (195), బొడిగె శ్రీహరి (172), మొరిగాల సురేష్ (187), సుదగాని కిష్టయ్య (181 ), బుషిగంపల పుష్ప ( 198), మొరిగాల నర్సమ్మ (184 ) గెలుపొందారని ఎన్నికల అధికారి ప్రకటించి వారికి ఎన్నికల పత్రాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. ఈనెల 18న సంఘం అధ్యక్షునితో పాటు కార్యవర్గం ఎన్నుకోనున్నట్టు తెలిపారు. అనంతరం నూతన డైరెక్టర్లను సన్మానించి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# పాలడుగు స్కూల్‌లో విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతిరాత (లూసిడా కాలిగ్రఫీ)పై శిక్షణనిస్తున్నారు. విద్యార్థుల చేతి రాతతో అక్షరాలు అందంగా, ఆకర్షణీయంగా ఉండేలా వారికి కార్పొరేట్ స్థాయిలో లూసిడా కాలిగ్రఫీపై ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. మంగళవారం పాఠశాలను ఎంఈవో సత్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం దేవినేని అరవిందరాయుడు సందర్శించి విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. విద్యార్థులు చదువుతో పాటు చేతిరాత కూడా అందంగా ఉంటే మంచి ఫలితాలు సాధిస్తారని, పరీక్షల్లో మంచి రైటింగ్‌తో రాస్తే ఫలితాలు కూడా మెరుగ్గా ఉంటాయన్నారు. లూసిడా కాలిగ్రఫీతో విద్యార్థుల్లో చేతిరాతపై ఎంతో ఆసక్తి పెరుగుతుందని, వారిలో మరింత నైపుణ్యం పెంచేందుకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ

## చేతిరాతను మెరుగుపర్చేందుకు లూసిడా కాలిగ్రఫీ ప్రోగ్రాం



పాఠశాలలో చేతిరాతపై కార్పొరేట్ స్థాయిలో లూసిడా కాలిగ్రఫీ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, ఈ కార్యక్రమాన్ని మరింతగా విస్తరించినట్లయితే విద్యార్థులకు ఎంత ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
16 - 09 - 2026

# తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర వక్రీకరణను తిప్పికొట్టాలి




## సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

ప్రజావారధి/మోత్కూరు

నిజాం నిరంకుశ పాలన అణచివేత, దోపిడీ, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించాలని చూస్తున్న బీజేపీ విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలో మంగళ వారం అమరవీరుల స్తూపాల వద్ద నివాళ ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేతకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, పేద ప్రజలు కలిసి పోరాటం చేశారన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ చరిత్రలోనే గొప్ప ప్రజా పోరాటంగా నిలిచిందన్నారు. అలాంటి పోరాటాన్ని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా సెప్టెంబర్ 17 విమోచన దినంగా బీజేపీ వక్రీకరించే ప్రయత్నం చేస్తుందన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అకృత్యాలపై కులమతాలకు అతీతంగా ముస్లింలైన మహమ్మద్ ముఖ్దుం మోహినొద్దీన్, షేక్ బందగీ, షాయభుల్లాఖాన్ లాంటి అనేక మంది పోరాటంలో అమరులయ్యారని, అమరుల బలిదానాలతో సాయుధపోరాటం విజయవం తమైందని, 1948 సెప్టెంబర్ 17న భారత్‌లో విలీనమైందని తెలిపారు. సాయుధ పోరాటం తో ఎలాంటి సంబంధం లేని వారు చరిత్రను వక్రీకరిస్తూ మతం రంగుపులిమితే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటంలో ఎందరో కమ్యూని స్టులు అమరుల య్యారని, వారి పోరాట స్మృతులు నేటికీ అనేక గ్రామాల్లో స్తూపాలుగా ప్రత్యేక సాక్షాలుగా ఉన్నాయ న్నారు. వారి త్యాగాలను, పోరాటాన్ని నేటి తరాలకు తెలిసే విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, రాచకొండ కనకయ్య, కురిమేటి సోమయ్య, బండి రవి తదితరులు పాల్గొన్నారు.